


**"ఆగి పోయావేం కోయిలా?"**

**"..........."**

**'ఆకలెయ్యలే? నిన్ననగా తిన్నావు. ఆకలెయ్యకుండా ఎలా ఉంటుంది?'**

**"...."**

**"అరె! నీ కళ్లల్లో కన్నీళ్లు! ఎందుకని కోయిలా? నేను నీకు మంచి చివుళ్లందించలేక పోతున్నానా? అవి రుచిగా ఉండడంలేదా?"**

"ఎంతమాట! నీ చివుళ్ల చూడడానికే ఎంతో ముచ్చటగా ఉంటాయి. అవి ఎరుపంటే ఎరుపు కాదు. ఇటుక రంగా అంటే అదీ కాదు. జేగురు వర్ణ మసలే కాదు.. అన్నీ కలసిన అద్భుత మయిన చాయ. ఆ రంగుకి సరయిన పేరే లేదు. మనుషు లెంత గింజుకున్నా అలాటి రంగుని సృష్టించనే లేరు! ఇక వాటి మృదుత్వం! చెప్పనలవేకాదు. రుచి సంగతా? అడక్కు. చిరువగరు. లేశమాత్రంగా తీపి.. రేఖామాత్రంగా పులుపు.... గమ్మత్తయిన కమ్మదనం.. ఎన్ని రుచుల కలగలుపో! తింటే తెలుస్తుంది. నన్నడిగితే మావిచిగురంతటి మధుర మయిన ఖాద్యం మరొకటి ఉండనే ఉండదంటాను కంఠాపథంగా.."

" ఎలా? నాకు నోరు రావడంలేదే!"

"ఎందుకనీ? ఏమైందీ నీకు?"

"జ్ఞానోదయం.. ఉహు.. కనువిప్పు.."

"నువ్వనే దేమిటి?"

" ఓ రసాలవృక్షమా! నువ్వెంతో మంచిదానివి. నాకు నిలువ నీడ నిస్తున్నావ్. నా నల్లని రూపా న్నసహ్యించుకోకుండా నీ అందమైన ఆకు పచ్చని ఆకులలోఆప్యాయంగా ఆదరంగా ఆశ్రయం కల్పిస్తావ్. నీ కొమ్మల్లో గూళ్లు కట్టుకునే కాకులే నా గుడ్లని పొదుగుతాయి. ఇన్ని విధాలుగా నువ్వు నాకు మేలు చేస్తూంటే చూస్తూ చూస్తూ నీ లేలేత శిశువులని... చివుళ్లను ఎలా తినేసేదీ? న్యాయమా? ధర్మమా? తిన్నింటి వాసాలు లెక్కించడమే కాదూ అది? కృతఘ్నత అవదూ?"

దైన్యంలో కూడా నవ్వింది. " అదేనా నీ బాధ?"

"మరే.. అదే.."

'ప్రకృతిలో ఒక జీవి మరొక జీవికి ఆహారం కావడం న్యాయమే. ధర్మమే. అసహజమూ కాదు, అపరాధమూ కాదు. సృష్టిధర్మా న్నతిక్రమించ బోతేనే అజ్ఞానమో, అమాయకత్వమో, అపరాధమో ఔతుంది. నా కిసలయాలను మేస్తే ఏం? నువ్వు నా కెంత ఉపకారం చేసి పెడుతుంటావో! ఓ గానకోకిలా... సందేహించకు... కడుపు నింపుకో...'

"నేనా! మేలా!..." నిజమేనా అని అడుగుతున్నట్లే గొణిగింది కోయిల.

" మనుషులకీ, పిట్టలకీ కాయలూ, పళ్లూ, నీడా ఇస్తున్నట్లే నేను నీకు నా చివుళ్లూ అందిస్తున్నాను. మిగిలిన వాళ్లయితే నా గురించే తిరిగి ఆలోచించరు. కాని నువ్వో? చక్కని సంగీతం వినిపిస్తూ నన్ను నిలువునా పులకరింప జేస్తావు. నీ గానం నాకు జీవమూ, చైతన్యమూ. అందువల్లనే అన్ని చివుళ్లు. ఇక నీ వల్ల నాకెంత గుర్తింపు! ఎంత కవితా గౌరవం! ఎన్ని చిత్రాలలో స్థానం! ఎంత పేరుప్రఖ్యాతులు! ఎంత ప్రత్యేకత మిగిలిన వృక్షాలకంటే! ఇవన్నీ.. ఈ అదృష్టాలన్నీ నీవంటి గాన కోకిల దయతో నీ చివుళ్లు మేస్తూ నా కొమ్మల రెమ్మల ఇంటి నుండడంవల్లనే కదా? నా చివుళ్లని నీకు నైవేద్యం పెట్టడం నాకు మహదానందమే తప్ప మరేమీ కాదు. మావిచివుళ్లు మేయడంవల్లనే కోయిల కంత చక్కని కంఠం అనుకుంటున్నా రెందరో సహృదయులు. అది చాలదూ నా జన్మ ధన్యమూ, సార్థకమూ అవడానికి? నువ్వు ఆకలితో అలమటిస్తూ కూయడం మానేస్తే లోకానికి వసంతం ఎలా ఒస్తుందీ? వసంతఋతువు రాకపోతే ప్రకృతికి సౌందర్యం ఎలా భాసిస్తుంది? నేను మరిన్ని చివుళ్లెలా పెట్టగలుగుతానూ? అమ్మో.. ఆ పరిస్థితి ఎంత దారుణం! అంచేత.. ఓ కోయిలా! చింత మాను. నా చివుళ్లు ఆరగించు. తీయనిగానం ఆలపించు. జగత్తును సంగీత మయమూ సౌందర్య మయమూ చెయ్యి దయచేసి."వేడుకుంటున్నట్లే.. నైవేద్యం అందిస్తున్నట్లే.. చివుళ్లు కోయిల నోటికందేలా తన కొమ్మల రెమ్మలని జరిపిందటు మామిడి.